నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
13 హైదరాబాద్, సోమవారం 11 మార్చి 2024 HYDERABAD



సేవా కార్యక్రమంలో పాల్గొన్న హ్యాపీ హైదరాబాద్ సభ్యులు

## పరిసరాల శుభ్రత..
# అందరి బాధ్యత

సిటీబ్యూరో, మార్చి 10 ( నమస్తే తెలంగాణ ) : సామాజిక సేవ చేయడానికి ఎంతమంది ముందుకొస్తారు? వచ్చినా పబ్లిసిటీ కోసం తాపత్రాయపడే వాళ్లే అధికం. ఆ సేవలోనూ తమ లాభమే చూసుకునే సంస్థలూ ఉన్నాయి. కానీ కేవలం ఇంటినే కాదు.. మన పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని నినదించే వాళ్లూ ఉన్నారు. ప్రతిరోజు రోడ్లు, కాలనీలు శుభ్రం చేసే పారిశుధ్య కార్మికుల సేవలను గౌరవించాలంటూ నినదిస్తున్నారు. సేవకు వయసుతో సంబంధం లేదని నిరూపిస్తున్నారు. వాళ్లే హ్యాపీ హైదరాబాద్, శ్రీగణేశ్ యువసేన, హెచ్‌సీజీ గ్రూప్ సభ్యులు. కొందరు నగరంలోని కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకుని దారుల వెంట చెత్తను శుభ్రం చేస్తే.. మరికొందరు పారిశుధ్య కార్మికుల కోసం ఎదురుచూడకుండా తమ వంతుగా వ్యర్థాలను డస్ట్‌బిన్‌లలో వేద్దాం అని చాటుతున్నారు. ఇంకొందరూ చెరువులను ఎంపిక చేసుకుని చెత్తను తొలగిస్తున్నారు. ఇలా ప్రతి వారంలో మూడు రోజులు వాళ్లంతా సేవలో నిమగ్నమవ్వడం విశేషం. ఈ సేవలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఆదర్శంగా నిలుస్తున్నారు. 75 ఏండ్ల పైబడిన విజయనాయుడు, శ్రీలక్ష్మి ఆదివారం తిరుమలగిరిలో పరిసరాలను పరిశుభ్రం చేసే కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించారు.

# ఊపిరిపోసిన పోలీసులు..

**తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు డయల్ 100కు ఓ వ్యక్తి ఫోన్**

**పోలీసులు వచ్చేలోపే కొన ఊపిరిలో..**

**సీపీఆర్ చేయడంతో నిలిచిన ప్రాణం**



బడంగ్‌పేట, మార్చి 10: తాను ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఓ వ్యక్తి డయల్ 100కు కాల్ చేశాడు. పోలీసులు వచ్చేలోపే అపస్మారకస్థితిలో ఉన్న అతడికి సీపీఆర్ చేసి..ప్రాణాలు కాపాడారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి..నిండు ప్రాణాలను నిలిపిన పోలీసులను ప్రతి ఒక్కరూ ప్రశంసించారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన జగన్ శనివారం అర్ధరాత్రి డయల్ 100కు ఫోన్ చేసి.. తాను ఉరివేసుకొని చనిపోతున్నట్లు చెప్పాడు. వెంటనే అక్కడి సిబ్బంది మీర్‌పేట పోలీస్ స్టేషన్‌కు సమాచారాన్ని చేరవేశారు. నైట్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుళ్లు సూర్యనారాయణ, నాగరాజు, రవి, హోంగార్డు నర్సింహులు హుటాహుటిన జగన్ ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఉరివేసుకొని వేలాడుతున్న జగన్ కొన ఊపిరితో ఉండటాన్ని గమనించి.. కిందకు దించారు. సీపీఆర్ చేసి.. ప్రాణాలు నిలిపారు. మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం జగన్ ఆరోగ్యం నిలకడగా ఉండటంతో అతడి కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ అధికారులు సైతం సిబ్బందిని ప్రశంసించారు.



## పాత కారు.. రాజసమే వేరు..



చారిత్రక నగరంలో వింటేజ్ కార్లు..కనువిందు చేశాయి. 1938 చెందిన ఆస్టిన్, మోరీస్ గ్యారెజెస్, ఫోర్డ్, బెంజ్ మొదలుకొని మొన్నటి అంబాసిడర్ కాలం వరకు వివిధ వాహనాలు అబ్బురపరిచాయి. క్లాసిక్ మోటార్ వెహికిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'రైడ్ ఇన్ పార్క్' పేరుతో వింటేజ్ కార్ల ర్యాలీని ఏర్పాటు చేశారు. నెక్లెస్‌రోడ్‌లో ప్రారంభమైన ఈ ర్యాలీ సోమాజిగూడలోని ది పార్క్ హోటల్ వరకు కొనసాగింది. దారిపొడవునా అలనాటి వింటేజ్ వాహనాలను చూసి సందర్శకులు సంబురపడ్డారు. ఫొటోలు తీస్తూ, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

*–ఖైరతాబాద్, మార్చి 10*



## అందెల రవమిది పదములదా..

**మాదాపూర్ శిల్పారామంలో సందడి నెలకొన్నది. ఆదివారం కావడంతో నగరవాసులు కుటుంబసమేతంగా తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన నృత్యప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నది.**



## గోవిందా శ్రిత.. గోకుల బృందా..

జూబ్లీహిల్స్‌లోని టీటీడీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీనివాసుడిని సింహ, ముత్యాల పందిరి వాహనాల్లో ఊరేగించారు.

–బంజారాహిల్స్, మార్చి 10



## పూల సోయగం..

**ఆదివారం ఆహ్లాద సాగర తీరం.. విరబూసిన పూల సోయగాలతో సందర్శకులకు మధురానుభూతిని పంచింది. ఈ అందమైన దృశ్య మాలికను 'నమస్తే' కెమెరా క్లిక్‌మనిపించింది.**

# పైసల్లేక..పనులు సాగుతలె

## నిలిచిన రహదారుల విస్తరణ

**దాదాపు 150 ప్రాంతాల్లో తీవ్రప్రభావం ▪ రోజురోజుకు ట్రాఫిక్ సమస్య జఠిలం**

సిటీబ్యూరో, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో ట్రాఫిక్ చిక్కులను అధిగమించేందుకు చేపడుతున్న రహదారుల విస్తరణ పనులపై నిధుల ప్రభావం తీవ్రంగా పడింది. ఆర్థిక సుడిగుండంలో చిక్కుకున్న బల్దియా.. అభివృద్ధి పనులకు నిధులను కేటాయించలేకపోతున్నది. దీంతో గడిచిన కొద్ది రోజులుగా వివిధ పథకం కింద జరుగుతున్న రహదారి విస్తరణ పనులు ముందుకు సాగడం లేదు. కొన్ని చోట్ల పూర్తిగా నిలిచిపోగా..మరికొన్ని ప్రాంతాల్లో నత్తనడకన నడుస్తున్నాయి. ఎస్‌ఆర్‌డీపీ, సాధారణ రోడ్లు, మిస్సింగ్ రోడ్లు, జంక్షన్ల అభివృద్ధి పనులకు జరగాల్సిన రహదారి విస్తరణ పనులతో దాదాపు 150 ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం పడుతున్నది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సికింద్రాబాద్, కోఠి, గచ్చిబౌలి, ఎల్బీనగర్, రామంతాపూర్, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో మరోవైపు వీఐపీల తాకిడి, మరోవైపు నిలిచిన రహదారి పనులతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు జఠిలవుతున్నది. వాస్తవంగా జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం వెయ్యి కోట్ల మేర భూ సేకరణ పనులు జరగాల్సి ఉంది. నిధులు లేకపోవడంతో ఈ ప్రక్రియ పూర్తిగా అటకెక్కింది. దీని కారణంగా ఎస్‌ఆర్‌డీపీలో భాగంగా శిల్పా లే అవుట్ ఫేజ్-2 ఫ్లై ఓవర్ పనులకు భూసేకరణ అంతరాయం ఏర్పడింది. నిర్దేశిత గడువులోగా ఈ ఫ్లై ఓవర్ పూర్తి కావడం అనుమానంగా ఉంది. మోడల్ కారిడార్ అభివృద్ధి పనులు కొన్ని చోట్ల జరుగుతుండగా, నాగోల్‌లో పనులు నిలిచిపోయాయి. ఆదర్శ్ సొసైటీ, అమెరికన్ కాన్సులెట్ వద్ద లింకు రోడ్డు పనులు తుది దశలో ఉన్నప్పటికీ పూర్తి చేయలేకపోతున్నారు. బోరబండ సున్నం చెరువు వద్ద లింకు రోడ్డు పూర్తి కాకపోయినప్పటికీ అధికారులు రికార్డులో పూర్తి అయినట్లు చెబుతూ తప్పుదోవ పట్టిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే చిలకలగూడ, సంగీత్ చౌరస్తా, పంజాగుట్ట, నాగార్జున సర్కిల్, సోమాజిగూడ రాజీవ్ సర్కిల్‌లో జంక్షన్ల అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. ఈ రహదారుల విస్తరణ పనుల్లో జరుగుతున్న ఆలస్యంతో ట్రాఫిక్ సమస్యలు అధిగమవుతున్నాయి. కమిషనర్, ప్రభుత్వం జోక్యం చేసుకొని రహదారుల విస్తరణ పనుల్లో వేగం పెంచాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



**రహదారి విస్తరణ పనుల వివరాలు**

| జోన్ | ఎస్‌ఆర్‌డీపీ | సాదారణ రోడ్లు | మిస్సింగ్ లింక్ రోడ్లు | జంక్షన్ల అభివృద్ధి | సీపీపీ |
|---|---|---|---|---|---|
| ఎల్బీనగర్ | 8 | 6 | 3 | 0 | 0 |
| చార్మినార్ | 6 | 21 | 5 | 0 | 4 |
| ఖైరతాబాద్ | 1 | 15 | 5 | 4 | 0 |
| శేరిలింగంపల్లి | 3 | 13 | 14 | 5 | 0 |
| కూకట్‌పల్లి | 0 | 14 | 4 | 1 | 0 |
| సికింద్రాబాద్ | 5 | 6 | 2 | 5 | 0 |

## 'హెచ్‌జీసీఎల్'లో
# సీఎం ఆఫీస్

**హెచ్ఎండీఏ ప్రత్యేక చర్యలు**

- రూ. 60 లక్షలతో రెండు భవనాల చుట్టూవ్యూ కట్టర్స్
- ఎంఆర్‌డీసీఎల్ లో రూ. 70 లక్షలతో ఇంటీరియర్ పనులు
- వాహనాల కోసం సిద్ధమవుతున్న పార్కింగ్ స్థలం



సిటీబ్యూరో, మార్చి 10 (నమస్తే తెలంగాణ): నానక్‌రాంగూడ ఔటర్ రింగురోడ్డు ఇంటర్‌చేంజ్‌లో ఉన్న హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) కార్యాలయం వీవీఐపీలకు ప్రధాన కేంద్రంగా మారనున్నది. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రికి సంబంధించి ఒక కార్యాలయాన్ని అక్కడే ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే అనేక సార్లు సీఎం రేవంత్ రెడ్డి హెచ్‌జీసీఎల్ కార్యాలయం నుంచి ఎంఏయూడీ పరిధిలోని పలు శాఖలతో ఉన్నతాధికారులు, ఆయా శాఖలు చేపట్టే ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షలు నిర్వహించారు. ప్రత్యేకంగా పురపాలక శాఖకు సంబంధించిన కార్యకలాపాలకు ఇది ఎంతో అనువుగా ఉండటంతో ఇక్కడి నుంచే ఆ శాఖ పరిధిలోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వాటర్ బోర్డు, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ (ఎంఆర్‌డీసీఎల్) వంటి శాఖల ఉన్నతాధికారులతో తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నానక్‌రాంగూడ హెచ్‌జీసీఎల్ భవనాల వద్ద భద్రతపరంగా పటిష్టమైన చర్యలు చేపట్టాలని హెచ్ఎండీఏ అధికారులు నిర్ణయించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దే ఉండటంతో ఇక్కడ ఆయన కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇప్పటికే ముఖ్యమంత్రి కూర్చునేందుకు ప్రత్యేకంగా చాంబర్‌తో పాటు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించేందుకు సెమినార్ హాల్స్ రెండు ఉన్నాయి. దీంతో సీఎం స్థాయికి తగ్గట్టుగా ఇక్కడ మార్పులు చేర్పులు చేస్తూ హెచ్‌జీసీఎల్ కార్యాలయంలో భద్రతాపరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా సుమారు రూ.60 లక్షల వ్యయంతో రెండు భవనాల చుట్టూ రక్షణగా వ్యూ కట్టర్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. త్రిభుజాకారంలో ఉన్న ఈ భవనాల చుట్టూ రోడ్లే ఉన్నాయి. దీంతో ఈ చర్యలు చేపట్టినట్లు ఓ అధికారి తెలిపారు.

### ఇక్కడే మూసీ కార్యాలయం...

హైదరాబాద్ మహానగరానికి సంబంధించిన కీలకమైన ప్రభుత్వ శాఖలతో తరచూ సమావేశాలు నిర్వహించేందుకు రాష్ట్ర సచివాలయం కన్నా ఇది ఎంతో అనువుగా ఉంటుందని గుర్తించారు. అదే విధంగా కొత్తగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు సంబంధించిన కార్యాలయాన్ని తార్నాక నుంచి ఇక్కడికి తరలిస్తున్నారు. ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో దాని పురోగతిని సీఎం స్వయంగా పర్యవేక్షించేందుకు వీలుగా ఇక్కడ కార్యాలయాన్ని సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే సుమారు రూ.70 లక్షల వ్యయంతో ఇంటీరియర్ పనులు చేపట్టారు. ఐటీ కారిడార్‌లో ఉన్న ఈ రెండు భవనాలను ఔటర్ రింగు రోడ్డు ప్రాజెక్టు నిర్వహణ కోసం ప్రత్యేకంగా గచ్చిబౌలి నుంచి నార్సింగి వెళ్లే మార్గంలో నానక్‌రాంగూడ జంక్షన్‌లో హెచ్ఎండీఏ నిర్మించింది. అమీర్‌పేటలో హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయం ఉన్నా, మెట్రోపాలిటన్ కమిషనర్, జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్లు ఎక్కువ సమయంలో ఇక్కడున్న తమ చాంబర్ల నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే ఓఆర్‌ఆర్ నానక్‌రాంగూడ ఇంటర్‌చేంజ్‌లో ఉన్న హెచ్‌జీసీఎల్ భవనాల్లో సీఎం కోసం ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తుండటంతో పార్కింగ్ సమస్య ఉత్పన్నమవుతున్నట్లు గుర్తించారు. ఇప్పటికే ఉన్న రెండు భవనాల్లో ఔటర్ రింగు రోడ్డు ప్రాజెక్టుకు సంబంధించిన కార్యాలయం, టీ ఫైబర్, హైదరాబాద్ ఫార్మా సిటీ, టీఎస్ బీపాస్, హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ , మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయాలు ఉన్నాయి. దీంతో ఈ రెండు భవనాల్లో సీఎం వచ్చిన సమయంలో వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయని గుర్తించి, మరో చోట పార్కింగ్ స్థలాన్ని సిద్ధం చేస్తున్నారు.

## టీ వర్క్స్ సందర్శన



సిటీబ్యూరో, మార్చి 10 (నమస్తే తెలంగాణ): దేశంలోనే అతి పెద్ద నమూనాల తయారీ కేంద్రమైన టీ వర్క్స్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆదివారం సందర్శించారు. టీ వర్క్స్‌లో ఏర్పాటు చేసిన తయారీ యంత్రాలను మంత్రి పరిశీలించారు. ముఖ్యంగా టీ వర్క్స్‌లో ఉన్న మౌలిక వసతులు, అందులో జరుగుతున్న కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. భౌతిక ఆవిష్కరణలు జరిగేందుకు టీవర్క్స్ ఎంతో అనుకూలంగా ఉందన్నారు.

## సీడీఎఫ్‌డీలో సదస్సులు

సిటీబ్యూరో, మార్చి 10(నమస్తే తెలంగాణ) : శాస్త్ర, సాంకేతిక రంగంలో మహిళల పాత్ర అంశంపై సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ సెమినార్ జరగనున్నది. ఈనెల 13న సీడీఎఫ్‌డీలోని సెమినార్ హాల్‌లో నిర్వహించే ఈ సదస్సులో ముఖ్య అతిథిగా వీ హబ్ సీఈవో దీప్తిరావు ప్రసంగించనున్నారు. ఉదయం 11.30 గంటలకు నిర్వహించే సదస్సు ద్వారా స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యథమెటిక్స్ ) రంగంలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా సదస్సు నిర్వహిస్తున్నట్లుగా సీడీఎఫ్‌డీ వర్గాలు వెల్లడించాయి. అలాగే ఈ నెల 18న సెల్ బయాలజీపై అంతర్జాతీయ సదస్సు జరగనున్నది. 'సిస్టమ్స్ బయాలజీ ఇన్ సింగిల్ సెల్స్.. ఏ టేల్ ఆఫ్ టూ వైరసెస్' పేరిట నిర్వహించనున్న ఈ సదస్సులో దేలేవర్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ అభ్యుదయ్ సింగ్ ప్రసంగించనున్నారు. హెచ్ఐవీ జన్యు క్రమంపై చర్చించనున్నారు.

## గ్రేటర్@35.2



సిటీబ్యూరో, మార్చి 10 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ఠం 35.2, కనిష్ఠం 23.5 డిగ్రీలు, గాలిలో తేమ 41 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.



## 'మేడ్చల్'లో మరిన్ని పోలింగ్ స్టేషన్లు..!

మేడ్చల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ స్టేషన్ల పెంపునకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా పార్లమెంట్ పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో గ్రామీణ బూత్ స్థాయిలో ఒక పోలింగ్ కేంద్రానికి 1500 మంది అర్బన్ బూత్ స్థాయిలో 1600 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా చూస్తున్నారు. గ్రామీణ, అర్బన్ బూత్ స్థాయిలో అంతకంటే ఎక్కువ మంది ఓటర్లు ఉంటే సమీపంలోనే మరో పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్‌కు అవసరమయ్యే పోలింగ్ స్టేషన్ల జాబితాను పంపించనున్నారు. దీంతో మేడ్చల్-మల్కాజిగిరిలో జిల్లాలో మరిన్ని పోలింగ్ స్టేషన్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 2397 పోలింగ్ స్టేషన్లు ఉండగా, అందులో మేడ్చల్ నియోజకవర్గంలో 580, మల్కాజిగిరిలో 411, కుత్బుల్లాపూర్‌లో 582, కూకట్‌పల్లిలో 417, ఉప్పల్‌లో 407 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. గ్రామీణ బూత్ స్థాయిలో 1500, అర్బన్ బూత్‌స్థాయిలో 1600 మంది ఓటర్లు మించిన ఉన్న బూత్‌లను ఇప్పటికే ఎన్నికల అధికారులు గుర్తించారు. ఎన్నికల సంఘానికి పోలింగ్ బూత్‌ల వివరాలను పంపిన అనంతరం ఆమోదం లభిస్తే జిల్లాలో పోలింగ్ స్టేషన్ల సంఖ్య పెరగనున్నట్లు అధికారులు వెల్లడించారు.